## కథ మళ్లీ మొదటికొచ్చింది..



2014 కన్నా ముందు ఎలాంటి సాగునీటి వనరులు లేవు. వర్షాధారం పైనే ఆధారపడి సేద్యం చేసేటోళ్లం. వానలు కురువక, పంటలు పండక పిల్లాపాపలతో ముంబాయి, హైదరాబాద్‌కు వలసెల్లి బతికినం. పొలాల్లో సర్కారు తుమ్మచెట్లు దట్టంగా పెరిగి సేద్యం చేయడానికి రాకుండేది. పొలాలు బీళ్లుగా మారి, చెరువులు, కుంటలు ఎండి ఎడారిగా మారేవి. ఊళ్లల్లో ఉన్న వాళ్లు పంటలు పండక.. అప్పులు తీరక ఎంతోమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కరెంట్ ఉదయం 3గంటలు, రాత్రి మూడు గంటలు ఇవ్వడంతో.. కరెంట్ కోసం మోటర్ల వద్ద రాత్రీపగలు తేడాలేకుండా పడిగాపులు కాసేటోళ్లం. చీకట్ల పాము కాట్లకు ఎంతమందో సచ్చిపోయింత్రు. 2014తరువాత తెలంగాణ రాష్ట్రం వచ్చినంక.. కేసీఆర్ ప్రభుత్వం అధికారం చేపట్టి పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయించిండు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటిచ్చిండు. దీంతో ఏడేండ్లు పంటలు పుష్కలంగా పండినయ్. విద్యుత్ మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయే పరిస్థితే లేకుండే. నాణ్యమైన విద్యుత్ ఇస్తుండడంతో సంతోషంగా సాగు చేసుకున్నం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక కథ మళ్లీ మొదటికొచ్చింది. 24 గంటల పాటు వ్యవసాయానికి కరెంటిస్తలేరు. కోతలు విధిస్తున్నారు. లో వోల్టేజీ వల్ల మోటర్లు కాలిపోతున్నయి.

*- వీరపాగ వెంకటస్వామి, రైతు, నాగులపల్లి, కోడేరు మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా*

## నయా పైసా అవినీతి జరగలే..



తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు కరెంట్ కోసం ఎన్నో సార్లు ధర్నాలు, రాస్తారోకోలు చేసినం. కాంగ్రెస్, తెలుగు దేశం పార్టీలు అధికారంలో ఉన్నన్ని రోజులు వాళ్ల మీద వీళ్లు, వీళ్ల మీద వాళ్లు చాడీలు చెప్పుకోవడం తప్పా.. కరెంట్ కష్టాలు మాత్రం తీర్చింది లేదు. కరెంట్ ఇవ్వకుండా మమ్మల్ని సావగొట్టింత్రు. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇచ్చిండు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చింత్రు. కరెంట్ స్తంభాలు పాతుకొని బోరు బావులకు లైన్లు గుంజుకున్నాం. నిరంతర కరెంట్ ఉండడంతో 5 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుని దర్జాగా పంటలు పండించుకున్నం. కేసీఆర్ రైతు పక్షపాతి. మా బాగుకోసం పరితపించిన మహా నాయకుడు. కష్టాలు దరిచేరకుండా కంటికి రెప్పలా కాపాడిన మహానుభావుడు. ఆయన హయాంలో నయా పైసా అవినీతి జరగలేదు.

*- గవినోళ్ల హన్మిరెడ్డి, రైతు, బిజ్వారం, ఊట్కూర్ మండలం, నారాయణపేట జిల్లా*

## కేసీఆర్ హయాంలోనే ఫుల్ కరెంట్..



కేసీఆర్ హయాంలో పదేండ్లు కరెంట్ ఫుల్లుగా ఇచ్చేది. ఎప్పుడైనా సేనుకు పోయి బోర్లు వేసుకుని పంటలు పండించుకునేటోళ్లం. పదేండ్లపాటు 24 గంటల కరెంట్ ఇచ్చిన్రు. ఇష్టం వచ్చిన పంటలు పండించేది. 2014 కంటే ముందు కరెంట్ కోసం ఎంత తండ్లాడామో ఇప్పుటికీ గుర్తున్నది. కరెంట్ ఎప్పుడు వస్తుండెనో.. ఎప్పుడు పోతుండెనో తెలియని పరిస్థితి. రాత్రిళ్లు మోటర్లకాడనే పడుకుని ఇబ్బందులు పడినం. కేసీఆర్ సార్ వచ్చినంక కరెంట్ రంది లేకుండా గడిపినం. ఇప్పుడేమో మళ్లీ పాతరోజులొస్తాయని భయమైతుంది. వానకాలం సాగు చేద్దామంటే కరెంట్ ఇబ్బందులున్నయ్. వానలు కురవక ఆకాశం వైపు చూస్తున్నం. ఉన్న నీటిని పారించి సాగు చేద్దామన్నా కరెంట్ తిప్పలు తప్పడం లేదు.


*- తిమ్మప్ప, రైతు, అయిజ, జోగులాంబ గద్వాల జిల్లా*

## మళ్లీ పట్నం పోవాల్నేమో..



గతంలో వర్షాలు పడక, సాగునీళ్లు లేక పంటలు పండించే పరిస్థితి లేక చాలామంది రైతులు పొలాలను వదిలేసి పట్టణాలకు వలసపోయింత్రు. ఏదోఒక పని చేసుకుంటూ బతికింత్రు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చినంక రాష్ట్రం పచ్చబడింది. వనపర్తి చుట్టుపక్కలకు కూడా సాగునీళ్లు వచ్చినయ్. దీంతో ఊళ్లు విడిచిపోయిన రైతు కుటుంబాలు మళ్లీ సొంత ఊరికి వచ్చి సంతోషంగా సాగు చేసుకొని బతికింత్రు. ఈ పదేండ్లలో పట్టణాలను వదిలి పల్లెలకు వచ్చింత్రు. సాగునీళ్లు, కరెంట్ మంచిగ ఉండడంతో పంటలు పండించుకుంటూ ఇక్కడే స్థిరపడిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కొన్ని రోజుల్లోనే కరెంట్ కోతలు, సాగునీళ్లు అందక, వర్షాలు పడక దిక్కుతోచని పరిస్థితిలో పడ్డాం. కేసీఆర్ ముందుచూపుతో కట్టిన అన్ని ప్రాజెక్టులను ఈ సర్కారు ఎండబెట్టింది. గతంలో ఎండాకాలంలో కూడా పల్లెల్లోని చెరువులు సైతం నీళ్లతో కళకళలాడేవి. ఇప్పుడు నీళ్లు లేక పాతరోజులు గుర్తొస్తున్నయ్. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే గ్రామాల్లో కళ తప్పినయ్. దీంతో పంటలు సాగు చేయాలా? లేక మళ్లీ పట్నం పోయి ఏమైనా పని చేసుకోవాలా? అని ఆలోచిస్తున్నం.

*- తిరుపతయ్యగౌడ్, రైతు, కడుకుంట్ల, వనపర్తి మండలం*



## వ్యాపారం జరుగుతలేదు..



రాత్రి వేళ కరెంట్ తీస్తుండటంతో వ్యాపారం అయితలేదు. ప్రజలు పగలంతా పనులు ముగించుకొని రాత్రి వేళ కొనుగోలు చేయడానికి వస్తరు. ఆ టైంల కరెంట్ లేక తిరిగి వెళ్తున్నరు. వ్యాపారం జరుగక ఇబ్బందులు పడుతున్నం. కేసీఆర్ హయాంల కరెంట్ బాగుండే. గాలొచ్చినా, వానొచ్చినా తీసెటోళ్లు కాదు. ఇప్పుడు అంతా మరింది.

*- బాలరాజు, చిరు వ్యాపారి, అయిజ పట్టణం, జోగులాంబ గద్వాల జిల్లా*

- గాలి వీచినా.. చినుకు పడినా పవర్ కట్..
- ప్రమాదకర స్థితిలో వ్యవసాయం
- పల్లెల్లో రచ్చబండ వద్ద కరెంట్ ముచ్చటే

## రైతుల గురించి ఆలోచించాలె..



గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కరెంట్ కష్టాలు చూశాం. తెలంగాణ ఏర్పడినాక కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యి రైతులకు 24 గంటల ఉచిత నాణ్యమైన కరెంటిచ్చిండు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. కరెంట్ రాత్రిపూట వస్తే పొలాల్లో పడుకునే పరిస్థితి వచ్చేటట్లుంది. సీఎం రేవంత్ రెడ్డి రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి. కేసీఆర్ సార్ ఇచ్చినట్లు 24 గంటల కరెంట్ ఇవ్వాలే. అప్పుడే పంటలు మంచిగ పండించుకుంటం. లేకపోతే పెట్టబడి ఎల్లక ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తది. ఏ ప్రభుత్వమైనా రైతుల గురించి ఆలోచించాలె. వాళ్ల స్వార్థం కోసం చూసుకుంటే మేం ఆగమైతం.

*- కృష్ణారెడ్డి, రైతు, అప్పంపల్లి, మరికల్ మండలం, నారాయణపేట జిల్లా*

## రచ్చకట్టల వద్ద కరెంట్ ముచ్చటే..



గతంలో సాగుకాలం వచ్చిందంటే మోటర్ మెకానిక్‌లకు చేతినిండా పనిదొరికేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆరు నెలలైంది. వానకాలం మొదలైనా వర్షాలు లేక రైతులు తుకాలు పోయడానికి ముందుకొస్తలేరు. ఇప్పటికే బోర్లు, కాల్వలను సరిచేసుకునేటోళ్లు. అలాంటికి ఇప్పటి దాకా రైతులు సాగు మొదలు చేయలేదు. ఇలా అయితే మాలాంటి మెకానిక్‌లకు పనిదొరకకపోతే ఏం చేయాల్నో అర్థమైతలేదు. గత పదేండ్లలో మోటర్లు కాలిపోయిన పరిస్థితులు చాలా తక్కువ. ఈ ప్రభుత్వం పూర్తిస్థాయిలో కరెంట్ ఇచ్చే పరిస్థితి కనిపిస్తలేదు. పంటలు సాగైతేనే కరెంట్ సరఫరా గురించి తెలుస్తది. తెలంగాణ రాకముందు కరెంట్ వచ్చి పోతుండె కాబట్టి మోటర్లు కాలిపోతయని రైతులు బోర్లకాడనే పండుకునేటోళ్లు. ఆ రోజులు మళ్లీ వచ్చేటట్లు కనిపిస్తున్నయని రైతులు మాతోన అంటున్నరు. ఊళ్లోని పెద్ద మనుషులు రచ్చకట్ట వద్ద కూర్చొని కరెంట్ మీదనే మాట్లాడుకుంటున్నరు. కేసీఆర్‌ను ఓడించుకున్నం.. మళ్లీ పాత రోజులొస్తయేమోనని భయపడుతున్నారు.

*- అశోక్, మోటర్ మెకానిక్, వనపర్తి*

# నాడు వెలుగులు.. నేడు చీకట్లు

- అడుగంటిన జలాశయాలు, బోరు బావులు
- నాణ్యత లేని కరెంట్‌తో కాలిపోతున్న మోటర్లు
- మళ్లీ వలసలు పోవాల్సి వస్తుందని ఆవేదన
- కేసీఆర్ పాలనే బాగుండే అంటున్న అన్నదాతలు
- మోటర్ వైండింగ్ మెకానిక్‌లకు చేతినిండా పని



**బీఆర్ఎస్ హయాంలో పదేండ్లపాటు వ్యవసాయాన్ని పండుగలా చేసిన రైతులు నేడు నాణ్యమైన కరెంట్ లేక నానా అవస్థలు పడుతున్నారు. తెలంగాణ రాకముందు పడిన ఇబ్బందులు మళ్లీ గుర్తుకొస్తున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా పొలాల వద్దనే ఉండి పంటకు నీరు పారించేవారు. ప్రస్తుతం సకాలంలో వర్షాలు కురవక అన్నదాత ఆకాశం వైపు చూసే రోజులొచ్చాయి. 'కేసీఆర్ హయాంలోనే కరెంట్ బాగుండే. గాలొచ్చినా, వానొచ్చినా పరిస్థితిని బట్టి కరెంట్ తీసెటోళ్లు.. ముచ్చటగా మూడు పంటలు సాగు చేసేటోళ్లం.. ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. మళ్లీ వలసలు పోవాల్సి వస్తుందేమో' అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏ రచ్చకట్ట వద్ద చూసినా కరెంట్ ముచ్చటే వినిపిస్తున్నది. అయితే నాణ్యత లేని విద్యుత్ సరఫరాతో కొన్ని చోట్ల మోటర్లు కాలిపోతుండగా.. వాటిని బాగుచేసి చెప్పిన సమయానికి రైతులకు ఇవ్వలేకపోతున్నామని మెకానిక్‌లు చెబుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నిరంతర విద్యుత్ సరఫరాతో రైతు మోములో ఆనందం నింపిన కేసీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అనుమానించడం సరైందికాదని రైతులు సూచిస్తున్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక.. పాలన చేతగాకే రేవంత్ సర్కారు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని మండిపడితున్నారు..**

*- మహబూబ్‌నగర్, జూన్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

## లోవోల్టేజీతో అవస్థలు పడుతున్నరు..



కేసీఆర్ ప్రభుత్వం వచ్చినంక 24 గంటల కరెంట్ నాణ్యతగా ఇవ్వడంతో మోటర్లు, స్టార్టర్లు కాలకుండే.. నిరంతరం కరెంట్ ఉంటుండె కాబట్టి.. రైతులు ఎవరికి ఇష్టమొచ్చినప్పుడు వాళ్లు బోర్లు వేసుకునేటోళ్లు. దీంతో లోవోల్టేజీ సమస్యనే ఉండకపోయేది. మోటర్లు కూడా కాలిపోయే అవకాశాలు చాలా తక్కువగా ఉంటుండె. రిపేర్ కోసం తక్కువ మోటర్లు వచ్చేవి. దీంతో మాకు పని తగ్గిండె. 24 గంటల ఉచిత కరెంట్‌తో మోటర్లు, స్టార్టర్లు కాలిపోకపోవడంతో రైతులు సంతోషపడ్డారు. కానీ కాంగ్రెస్ హయాంలో లోవోల్టేజీ, అరకొర విద్యుత్ సరఫరాతో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు కాలిపోతున్నయ్. దీంతో రైతులు ఎంతో ఇబ్బంది పడుతున్నరు. మళ్లీ పాతరోజులొచ్చాయని బాధపడుతున్నరు.

*- ఎండీ షఫీ, మోటరు వైండింగ్ మెకానిక్, కోడేరు మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా*

నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ

- ప్రతి ఉద్యోగి టైంకు హాజరుకావాలి
- విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తా
- ప్రభుత్వ కార్యక్రమాలు పక్కాగా అమలు చేస్తా

# సమయపాలన పాటించాల్సిందే..

- జిల్లా అభివృద్ధికి సమన్వయంతో ముందుకెళ్తాం
- ఓటమి స్ఫూర్తితో ముందుకెళ్తే గెలుపు తథ్యం
- 'నమస్తే తెలంగాణ'తో వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

***తల్లి ఇన్‌కం ట్యాక్స్ శాఖలో, తండ్రి రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేస్తున్నారు. తాతల కాలం నుంచి ఆ ఇంట్లో ఉద్యోగాల పరంపర కొనసాగుతూ వస్తున్నది. తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగస్తులు కావడంతో వారినే ఆదర్శంగా తీసుకున్న ఆదర్శ్ సురభి కష్టపడి చదివి కలెక్టర్‌గా ఎంపికయ్యాడు. ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించి వనపర్తికి కలెక్టర్‌గా వచ్చిన ఆదర్శ్ సురభిని 'నమస్తే తెలంగాణ' పలకరించింది.*** – వనపర్తి, జూన్ 20 (నమస్తే తెలంగాణ)



***నమస్తే తెలంగాణ : మీరు ఎవరిని ఆదర్శంగా తీసుకొని కలెక్టర్‌గా ఎదిగారు?***

***కలెక్టర్ :*** మా అమ్మ, నాన్నలే నాకు అదర్శం. అమ్మ నర్సమ్మ ఇన్‌కం ట్యాక్స్ శాఖలో చీఫ్ కమిషనర్‌గా మే 13న రిటైర్డ్ అయ్యారు. అలాగే నాన్న సురభి సత్తయ్య కామారెడ్డి జాయింట్ కలెక్టర్‌గా 2018లో ఉద్యోగ విరమణ పొందారు. నాకు ఒక తమ్ముడు అభిలాష్ సురభి, రేడియాలజిస్ట్‌లో ఎండీ చేస్తున్నారు. నేను కలెక్టర్ కావడానికి మా అమ్మ, నాన్నలే మార్గదర్శకం.

***విద్యాభ్యాసం ఎక్కడ చేశారు?***

నా విద్యాభ్యాసం ఎక్కువగా ఢిల్లీలోనే. 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఢిల్లీలోనే చదివా. ఐఐటీ కూడా అక్కడే చేశాను. అమ్మ ఉద్యోగ రీత్యా ఢిల్లీలోనే ఉండడంతో అక్కడే నా చదువు సాగింది. ఐఏఎస్ కోచింగ్ కూడా అక్కడే తీసుకున్నా. కానీ.. ఫస్ట్ టైం రాలేదు. రెండో ప్రయత్నంలో సాధించాను..

***మీ సొంతూరి వివరాలు చెబుతారా?***

అమ్మది ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం వద్దనున్న చెన్నూరు గ్రామం. నాన్నదేమో కరీంనగర్. నేను ఎక్కువగా ఢిల్లీలో ఉన్నప్పటికీ నా స్వస్థలం ఎక్కడని అడిగితే హైదరాబాద్ అనే చెబుతాను.

***కలెక్టర్‌గా వచ్చినందుకు ఎలా ఫీలవుతున్నారు?***

చాలా సంతోషంగా ఉంది. జిల్లా ప్రజలకు మంచి చేయాలన్న తపన ఉంది. అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు రచిస్తా. అధికారులు, ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండేలా చూస్తాను.

***మీరు ప్రధానంగా ఏ రంగాలపై దృష్టి పెట్టాలనుకుంటున్నారు?***

విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టితో ముందుకెళ్తాం. ఇప్పుడే విద్యా సంవత్సరం ప్రారంభమైంది. ప్రభుత్వం కూడా అన్ని బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పించి మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నది. మెరుగైన విద్య వల్ల గట్టి పునాది ఏర్పడుతుంది. అలాగే వర్షాకాలం ప్రారంభమైనందున ముందస్తుగా వ్యాధులు ప్రబలకుండా వైద్య, ఆరోగ్యశాఖ పరంగా తగిన జాగ్రత్తలు తీసుకుంటాం. వీటితోపాటు ఇతర శాఖలపై సమీక్షలు నిర్వహించి త్వరలోనే జిల్లాపై ఓ అవగాహనకు వచ్చేస్తా. ప్రజా సమస్యలను ప్రామాణికంగా తీసుకుంటాం.

***ఉద్యోగులకు ఏమైనా సూచనలు ఇవ్వాలనుకుంటున్నారా?***

ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యతగా వ్యవహరించాలి. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సమయపాలన పాటించాలి. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. సర్కారు కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉంటుంది.

***యూత్‌కు మీరిచ్చే సందేశం?***

యువత ఓటమిని తట్టుకోగలగాలి. ఓటమిని స్ఫూర్తిగా తీసుకుంటేనే గెలుపు సాధ్యం. కార్యాలయ గుమాస్తా నుంచి కలెక్టర్ ఉద్యోగం వరకు ప్రణాళికతో ముందుకు సాగితే చాలా సులభం. కేవలం 5 లేదా 6 గంటలపాటు క్రమపద్ధతిలో ప్రాక్టీస్ ఉంటే సరిపోతుంది. అనవసరమైన వాటికి దూరంగా అవసరమైన వాటికి దగ్గరగా ఉంటే చాలు.. అనుకున్నది సులభంగా సాధించొచ్చు.

## నులిపురుగులను నిర్మూలిద్దాం

- ఎమ్మెల్యే విజయుడు



ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

ఉండవెల్లి, జూన్ 20 : మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయుడు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 19 ఏండ్లలోపు వారంతా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకుంటే రక్తహీనత దరిచేరదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

- మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్

మహబూబ్‌నగర్, జూన్ 20 : జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఎస్పీ హర్షవర్ధన్ నుంచి ఆమె బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లా పరిధిలోని ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ప్రజల భద్రత, రక్షణే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఇసుక దందాపై ప్రత్యేకంగా దృష్టి సారించి అక్రమాలను అరికడతామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తానని, డ్రగ్స్ రవాణాను అడ్డుకుంటామన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే సామాన్యుడిని దృష్టిలో పెట్టుకొని వారితో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తప్పవన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు, విద్వేషాలను రెచ్చగొట్టే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ రాములు, ఏఆర్ ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లుతోపాటు సీఐలు, డీపీవో సిబ్బంది ఎస్పీకి మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ జానకి ధరావత్

## గడువులోగా సీఎంఆర్ బియ్యం ఇవ్వాలి

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ సంతోష్



మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూన్ 20 : నిర్ణీత గడువులోగా సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వని మిల్లర్లపై చర్యలు తప్పవని కలెక్టర్ సంతోష్ హెచ్చరించారు. గురువారం (2022–23) వానకాలం, యాసంగి సీజన్‌కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) యాజమాన్యాలతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. 26వ తేదీలోగా బియ్యాన్ని అందించాలని మిల్లర్లను ఆదేశించారు. గడువులోగా ఎఫ్‌సీఐకి పంపాలని, ధాన్యం నిల్వలను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 2022–23 వానకాలానికి సంబంధించి 93,268 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌కు గానూ 75,853 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి చెల్లించగా.. ఇంకా 17,415 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉన్నదన్నారు. అదేవిధంగా 2023–24 వానకాలానికి సంబంధించి 49,048 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యానికి గానూ 7,192 మెట్రిక్ టన్నులను ప్రభుత్వానికి చెల్లించగా ఇంకా.. 41,856 మెట్రిక్ టన్నుల బియ్యం అందించాల్సి ఉన్నదన్నారు.

నిర్ణీత గడువులోగా బియ్యాన్ని అందించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. మిల్లర్లతో శుక్రవారం మళ్లీ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్, బియ్యం సేల్, సప్లయ్ మేనేజర్ బాలరాజు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.